సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 14 । మే । 2023



అవనిపై అద్భుతం 'అమ్మ'

పదాలతో వివరించలేని మాట అమ్మ. దేవుడి సృష్టిలో అద్భుతం అమ్మ. నేడు అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనాలు..

10లో



కబ్జా కోరల్లో ఎర్రకుంట?

కుంటల కబ్జాకు బొల్లారం మున్సిపల్ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఏళ్ల కాలం నుంచి ఉన్న కుంటలు కబ్జాల పాలవుతున్నాయి.

11లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఎనిమిది మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

వేంకటేశ్వర ఆలయంలో కలెక్టర్ పూజలు



వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ దంపతులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులోగల వెంకటాచల దివ్య క్షేత్రం వేంకటేశ్వర ఆలయాన్ని శనివారం కలెక్టర్ డాక్టర్ శరత్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించారు. శ్రీవారికి అర్చన, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వేంకటేశం, సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ విశేషాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, ఉపసర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గుర్తించేందుకు సీఎం కప్ క్రీడలు

డీఏఓ నర్సింహరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ నర్సింహరావు

కల్హేర్(నారాయణఖేడ్): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు తెలిపారు. శనివారం కల్హేర్ మండల పరిషత్‌లో సీఎం కప్ క్రీడలపై సమావేశం నిర్వహించారు. ఈనెల 15 నుంచి మండల స్థాయి క్రీడలు కృష్ణాపూర్‌లో ప్రారంభిస్తామని తెలిపారు. క్రీడలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రపు సుశీల అంజయ్య, ఎంపీడీఓ సంగ్రామ్, ఎంపీఓ శ్రీనివాస్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ అభ్యాసకులకు ఎకనామిక్స్ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 840 మందికి గాను 727 మంది హాజరయ్యారు. 87 శాతం హాజరు నమోదైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వేంకటేశ్వర్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిందని పేర్కొన్నారు.

ఆర్టీసీని లాభాల బాట పట్టించాలి

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీని లాభాలబాట పట్టించాలని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులతో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రయాణికులను తమ మాట తీరుతూ ఆకట్టుకోవాలని, ఆర్టీసీ ఆదాయం పెరిగితే ఉద్యోగులకు జీతాలు, ఇతర సదుపాయాలు పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బైరి సోనీ ఆత్మహత్యకు సర్కార్ బాధ్యత వహించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్ రెడ్డి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోని ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బైరిసోని ఆత్మకు శాంతి చేకూరాలని ఆ పార్టీ నాయకులు సంగారెడ్డిలోని ఐబీ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ ఉద్యోగ భద్రత కోసం ఉద్యమిస్తుంటే ప్రభుత్వం వారికి నోటీసులు ఇవ్వడంతో ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్య చేసుకునే పరిస్థితిని తీసుకువస్తుందన్నారు. బైరి సోని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కదల్లేక.. వదల్లేక



రేషన్‌షాపులో సరకులు అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

- కొత్త పంచాయతీల్లో ఏర్పాటు చేయని రేషన్ దుకాణాలు
- ఇతర గ్రామాలకు కాలినడకన వెళ్తున్న లబ్ధిదారులు
- రేషన్ కోసం కూలి పనులు బంద్
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

వట్‌పల్లి(అందోల్): పాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకే నిత్యావసర సరుకులను అందించేందుకు చౌకధరల దుకాణాలను ఏర్పాటు చేసింది.

- ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతీ ఒక్కరికీ రేషన్ దుకాణాల ద్వారా చౌకధరలకే బియ్యం, ఇతర సరకులను అందిస్తోంది. అందులో భాగంగానే లబ్ధిదారులకు రూపాయికి కిలో బియ్యం చొప్పున ఒకొక్కరికి ఆరు కిలోల బియ్యం పంపిణీ చేస్తోంది.
- కొత్తగా ఏర్పడిన మెజార్టీ గ్రామ పంచాయతీలు, గిరిజన తండాల్లో ఈ దుకాణాలను ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పంచాయతీల్లో రేషన్ దుకాణాల ఏర్పాటు, కొత్త డీలర్ల నియామకంతో యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కిలోమీటర్ల దూరం నడవాల్సిందే..

- జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో 142 గ్రామ పంచాయితీలను నూతనంగా ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఆవాస గ్రామాలు ఉన్నాయి.
- ఐదేళ్లుగా కొత్త పంచాయతీల్లో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయలేదు. గతంలో ఇన్‌చార్జి డీలర్ల వివరాలు, నూతన రేషన్ దుకాణాలు కావాల్సిన గ్రామాల వివరాలను సేకరించినప్పటికీ, నూతన రేషన్ దుకాణాల ఏర్పాటుకు ఇప్పటి వరకు ముందడుగు పడలేదు.
- దీంతో లబ్ధిదారులు రేషన్ సరకుల కోసం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఈ దుకాణాలు దూరంగా ఉండటంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రేషన్ షాపు ఏర్పాటు చేయాలి



మండలంలోని మంచిర్యాలతండా నూతన గ్రామపంచాయతీలో రేషన్ షాపు ఏర్పాటుచేయాలి. రేషన్ సరకుల కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడికుందా, దుద్యాల గ్రామాలకు వెళ్తున్నాం. దీంతో దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ బియ్యం కోసం వెళ్తుండటంతో ఆరోజు కూలి పనులు వదులుకోవాల్సి వస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సుభాష్‌నాయక్, మంచిర్యాల తండా, వట్‌పల్లి మండలం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

జిల్లాలో నూతన రేషన్ దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రేషన్ డీలర్ల వివరాలు, నూతన దుకాణాల ఏర్పాటు వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. జిల్లాలో పుల్కల్ మండలం గొంగ్లూర్‌తండాలో నూతన రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని ఒక దరఖాస్తు వచ్చింది. మిగతా నూతన గ్రామ పంచాయతీల నుంచి రాలేదు.

– వనజాత, జిల్లా పౌరసరఫరాల అధికారి

జిల్లాలో ఆహారభద్రత కార్డులు, రేషన్ షాపుల వివరాలు

మొత్తం మండలాలు	- 28
గ్రామపంచాయతీలు	- 647
నూతన గ్రామ పంచాయతీలు	- 142
రేషన్ దుకాణాలు	- 845
మొత్తం రేషన్‌కార్డులు	- 3,72,429
రేషన్ లబ్ధిదారులు	- 12 లక్షల మంది

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

- తుపాన్ పొంచి ఉంది ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించండి
- తరుగు పేరుతో కోతలు లేకుండా చూడాలి
- జొన్న కొనుగోలు కేంద్రాలు మరూ చేయండి
- మంత్రి హరీశ్‌రావు



మంత్రి హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రెండు, మూడు రోజుల్లో తుపాన్ పొంచి ఉందని, వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. కొన్న ధాన్యాన్ని వెంట వెంటనే రైసుమిల్లులకు తరలించేలా ఎమ్మెల్యేలు, కేంద్రాల నిర్వాహకులు చొరవ చూపాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. తరుగు పేరుతో తూకంలో అడ్డగోలుగా కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేలు ప్రతీరోజు కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా ఉండాలని కోరారు. మిల్లర్లు ధాన్యం అన్‌లోడ్ చేసుకోవడం లేదని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కరించేలా మెదక్ కలెక్టర్‌ను ఆదేశిస్తామన్నారు. అకాల వర్షాలతో పంటనష్టం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేలు వెంటే జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో యువతను భాగస్వామ్యం చేయాలన్నారు. కలెక్టర్ శరత్ విజ్ఞప్తి మేరకు ఈనెల 22వ తేదీన జిల్లా స్థాయి క్రీడా పోటీల ప్రారంభానికి తాను హాజరవుతానని తెలిపారు.

10 జీపీఏ విద్యార్థులకు సన్మానం

పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు, వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులకు హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. 10 జీపీఏ సాధించి విద్యార్థులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, ఎం.భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, మాణిక్‌రావు, హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, కలెక్టర్ డాక్టర్ శరత్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో కాంగ్రెస్‌పైనే విశ్వాసం

మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహ



ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం దామోదర

జోగిపేట(అందోల్): కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని, మరో ఆరు మాసాల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపడుతున్నందున శనివారం జోగిపేటలో పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయనిర్ణేతలని, మార్పురావాలని అనుకుంటే ప్రధాని, సీఎంలనైనా ఓడిస్తారన్నారు. దేశ సమగ్రత, ఐక్యత, సామాజిక రాజకీయ ఆర్థిక అసమానతలు పోవాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు త్రిష దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్.సురేందర్‌గౌడ్, రంగ సురేశ్, చిట్టిబాబు, హరికృష్ణాగౌడ్, డి.శంకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు, మాజీ ఎంపీటీసీలు డీజీ వెంకటేశం, రాజిరెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు ప్రదీప్‌గౌడ్, శరత్‌బాబు, సీడీసీ మాజీ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ ప్రవీణ్, డి.శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవిశంకర్, నియోజకవర్గ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, ప్రవీణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో సంబరాలు:

కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు సందర్భంగా శనివారం జోగిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్‌కు ఘన స్వాగతం పలికారు. బసవేశ్వర విగ్రహం నుంచి పార్టీ కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. జాతీయ రహదారిపై బాణా సంచాలు కాలుస్తూ, స్వీట్లు పంచిపెడుతూ సందడి చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంతో పాటు ఐలాపూర్ తండాలో కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు విరివిగా జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టు, కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజాము నుంచి దాదాపు 150 మంది రెవెన్యూ సిబ్బంది, 200 మంది పోలీసుల బందోబస్తు మధ్య 350 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. నిర్మాణాల సమయంలో విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా, మీటర్లు ఇచ్చారని అప్పుడే తెలిపి ఉంటే నిర్మాణాలు చేసే వారిమి కాదని, ఇప్పుడు వచ్చి అన్యాయంగా తమనివాసాలను కూల్చి వేస్తున్నారని కొంతమంది పోలీసులుపై తిరగబడటంతో ఒకానొక సమయంలో లాఠీచార్జ్ చేసేందుకు యత్నించారు. కార్యక్రమంలో డీఎస్పీ భీమ్‌రెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి, అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, జిన్నారం వేణు కుమార్, బీడీఎల్ సీఐ వినాయక్ రెడ్డి, పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, అమీన్‌పూర్ తహసీల్దార్ దశరథ్, పటాన్‌చెరు తహసీల్దార్ పరమేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి

పటాన్‌చెరు టౌన్: కలెక్టర్ ఆదేశాల మేరకు పటాన్‌చెరు పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రిని డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి సందర్శించారు. శనివారం వార్త పత్రికలో 'ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్స' అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యుడు శ్రీనివాస్, ఆర్‌ఎం ప్రవీణతో కలిసి ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని మొదటి అంతస్తులో కొంతస్థలమే ఉండటంతో అందులోనే ఆర్‌హెచ్‌సీ విభాగం, ఆస్పత్రిని కొనసాగిస్తున్నామని డీసీహెచ్‌ఎస్‌కు వైద్యులు వివరించారు. అనంతరం డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి మాట్లాడుతూ వార్డులతో పాటు రూమ్‌లలో బెడ్స్‌ను సర్దుబాటు చేసి రోగులకు ఇబ్బందులకు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం బెదిరించడం అప్రజాస్వామికం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవతీసుకోకపోగా డెడ్‌లైన్ విధించడం అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు శనివారం పేర్కొన్నారు. సమ్మె చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కని, దానిని కాలరాయడం నిరంకుశత్వమన్నారు. ప్రభుత్వం వెంటనే జేపీఎస్‌లను చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి పూనుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రొబేషన్ పీరియడ్ పూర్తయినా క్రమబద్ధీకరించకపోవడంతో సమ్మెలోకి దిగారన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు కార్మిక సంఘాల మద్దతు

కొండాపూర్(సంగారెడ్డి): జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న పోరాటానికి కార్మిక సంఘాల మద్దతు ఉంటుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. సంగారెడ్డిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర నాయకుడు ఈశ్వర్ ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు రవీందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. గ్రామ పంచాయతీ జూనియర్ కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్ కోసం 14 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా వారిని బెదిరించడం సరైంది కాదన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



విగ్రహ ప్రతిష్ఠలో మేయర్ గద్వాల విజయలక్ష్మి

- హాజరైన మంత్రి తలసాని, మేయర్ విజయలక్ష్మి
- రూ.2.16 కోట్ల వ్యయంతో దేవాలయ నిర్మాణం
- 80 శాతం కార్పొరేటర్ సొంత నిధులతో పనులు

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీరుక్మిణీ సత్యభామ సహిత శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఇందులో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, కల్వకుర్తి శాసన సభ్యుడు జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. వారికి కార్పొరేటర్ దంపతులు ఘన స్వాగతం పలికారు. దేవాలయం నిర్మాణానికి కార్పొరేటర్ 80 శాతం సొంత నిధులు పెట్టడం అభినందనీయం అని పలువురు నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చిన్న ముదిరాజ్, బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, పటాన్‌చెరు నియోజకవర్గంలో వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు సీఐకి రుణపడి ఉంటా

విద్యార్థి వంశీకృష్ణ



సీఐ వేణుగోపాల్‌రెడ్డితో విద్యార్థి వంశీకృష్ణ

పటాన్‌చెరు టౌన్: కేన్సర్‌తో తండ్రి మృతి చెందగా, తల్లి పక్షవాతంతో మంచం పట్టడంతో పదో తరగతి చదివే వంశీకృష్ణ ఇంటి బాధ్యతలు తీసుకున్నాడు. స్కూల్‌కి వెళ్లకుండా టీస్టాల్‌లో పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకొని సీఐ వేణుగోపాల్‌రెడ్డి చదువుకు సాయంతోపాటు తల్లికి వైద్యం అందేలా చూస్తానని భరోసా ఇచ్చిన విషయం తెలిసిందే. సీఐ అండగా నిలుస్తానని హామీ ఇవ్వడంతో వంశీకృష్ణ పనిమానేసి తిరిగి పటాన్‌చెరు జెడ్పీహెచ్‌ఎస్(బాలుర)లో చేరి పదో తరగతి పరీక్ష రాశాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 8.8 జీపీఏ సాధించాడు. శనివారం పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డిని పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి వంశీకృష్ణ కలిసి కృతజ్ఞతలు తెలిపాడు. వంశీకృష్ణకు చదువు విషయంలో తాను అండగా ఉంటానని సీఐ చెప్పారు. దీంతో తాను పాలిటెక్నిక్ పరీక్ష రాస్తానని సీఐకి తెలిపాడు.

బీదర్‌లో బీజేపీ హవా

- నాలుగు స్థానాలలో విజయం
- రెండు స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్
- రెండు సిట్టింగ్ స్థానాలలో బీజేపీ విజయం
- కాంగ్రెస్, జేడీఎస్‌ల నుంచి చెరొక స్థానం బీజేపీ కైవసం
- బాల్కీలో ఈశ్వర్ ఖండ్రె వరుసగా విజయం



జహీరాబాద్: జహీరాబాద్‌కు పక్కనే ఉన్న కర్ణాటకలోని బీదర్ జిల్లాలో బీజేపీ మెజారిటీ స్థానాలలో విజయం సాధించింది. శనివారం బీదర్ జిల్లాకు సంబంధించిన ఆరు అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు భూంరెడ్డి కళాశాలలో నిర్వహించారు. ఇందులో నాలుగు స్థానాలలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించగా, కాంగ్రెస్ రెండు స్థానాలలో గెలుపొందింది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది.

- బీదర్ జిల్లాలో మాత్రం కాంగ్రెస్ పార్టీ ప్రభావం కనిపించలేదు. ఔరాద్ అసెంబ్లీ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన పశుసంవర్ధక శాఖ మంత్రి ప్రభు చౌహాన్ తన స్థానాన్ని నిలుపుకున్నాడు. ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భీంశంకర్ రావు షిండే పై 9,348 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- బస్వకళ్యాణ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి శరణు సల్గార తిరిగి గెలుపొందారు. ఆయన కాంగ్రెస్ అభ్యర్థి విజయ్ సింగ్‌పై 14,264 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- బీదర్ దక్షిణ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి శైలేంద్ర బెల్దాలె కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ ఖేణిపై 1,160 ఓట్ల మెజారిటీతో గెలుపొందినాడు. ఇక్కడ జేడీఎస్ తరఫున పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే బండెప్ప కాశింపూర్ మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు.
- హుమ్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి సిద్దు పాటిల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజశేఖర్ పాటిల్ పై 1,460 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- బాల్కి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈశ్వర్ ఖండ్రె వరుసగా నాలుగు సార్లు గెలుపొందారు. ఆయన బీజేపీ అభ్యర్థి ప్రకాష్ ఖండ్రెపై 27,438 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.
- బీదర్ ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసిన రహీం ఖాన్ జేడీఎస్ అభ్యర్థి సూర్యకాంత్ నాగమర్పల్లిపై 10,659 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక్కడ బీజేపీ మూడో స్థానంలో నిలిచింది.



ప్రభు చౌహాన్ (బీజేపీ, ఔరాద్)



శరణు సల్గార (బీజేపీ, బస్వకళ్యాణ్)



సిద్దు పాటిల్ (బీజేపీ, హుమ్నాబాద్)



శైలేంద్ర బెల్దాలె (బీజేపీ, బీదర్ దక్షిణం)



ఈశ్వర్ ఖండ్రె (కాంగ్రెస్, బాల్కి)



రహీంఖాన్ (కాంగ్రెస్, బీదర్ ఉత్తరం)

క్లుప్తంగా

ముగ్గురి అదృశ్యం

పటాన్‌చెరులో ఇద్దరు విద్యార్థినులు..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీసుల స్టేషన్ పరిధిలో ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన యువతి (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసింది. అమీన్‌పూర్‌కు చెందిన ఆమె స్నేహితురాలు శుక్రవారం అంబేడ్కర్ కాలనీకి వచ్చింది. ఈ క్రమంలో ఇద్దరు మాట్లాడుకుంటుండగా, యువతి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. తిరిగి వారు ఇంటికి వచ్చే సరికి కూతురు కనిపించలేదు. వెళ్లే సమయంలో తన తోపాటు సర్టిఫికెట్స్, దుస్తులు తీసుకొని వెళ్లినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అమీన్‌పూర్‌కు చెందిన యువతి స్నేహితురాలు కూడా కనిపించడం లేదు.

రేగోడ్‌లో వివాహిత..



పద్మ (ఫైల్)

నారాయణఖేడ్: వివాహ శుభకార్యానికి అత్తారింటి నుంచి బయల్దేరిన వివాహిత మహిళ అదృశ్యమైందని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రం రేగోడ్‌కు చెందిన ముప్పారం పద్మ(37) ఈనెల 11న తన తల్లిగారి ఊరు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ర్యాలమడుగులో ఓ వివాహానికి హాజరయ్యేందుకు రేగోడ్ నుంచి బయలు దేరింది. అప్పటినుంచి ఆమె జాడలేకుండా పోయింది. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈమేరకు సదరు మహిళ తండ్రి కమ్మరి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వద్ద చెక్ డ్యాంలో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ విజయ్ తెలిపారు. మృతుడి వయసు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై నలుపు, తెలుపు గీతల టీషర్టు, నల్లటి డ్రాయర్ ఉందని అన్నారు. మంజీర నది ఎగువ భాగం నుంచి మృతదేహం కొట్టుకొని వచ్చి ఉండవచ్చన్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

అవనిపై అద్భుతం అమ్మ



'పెదవే పలికిన మాటల్లోని తీయని మాటే అమ్మా.. కదిలే దేవత అమ్మా.. కంటి వెలుగు అమ్మా'.. అంటూ ఓ సినీ కవి తన పాటతో అమ్మ ప్రేమను ఎంతో గొప్పగా వర్ణించాడు. పదాలతో వివరించలేని మాట అమ్మ. దేవుడి సృష్టిలో ఓ అద్భుతం అమ్మ. అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా అమ్మ ప్రేమను గుర్తు చేసుకునేలా పలువురి అభిప్రాయాలతో సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనాలు మీకోసం..

మాతృ దినోత్సవం



గుడి కట్టి పూజలు

దుబ్బాకటౌన్: నవ మాసాలు మోసి, కని పెంచిన తల్లి తమకు దూరం కావడంతో తట్టుకోలేని కుమారులు ఆ మాతృమూర్తికి గుడి కట్టించి నిత్యం కొలుస్తున్నారు. ఆమె జ్ఞాపకార్థం గుడిలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యం కొలుస్తూ వారి ప్రేమను చాటుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గోసాన్‌పల్లికి చెందిన చిన్నరాజాగౌడ్, కొలుగూరి సత్తవ్వకు నలుగురు కుమారులు నర్సాగౌడ్, నారాగౌడ్, చంద్రాగౌడ్, చిన్నచంద్రాగౌడ్, వెంకట్‌గౌడ్, ముగ్గురు కుమార్తెలు కళావతి, లక్ష్మీ, రేణుక సంతానం. తండ్రి గతంలోనే చనిపోవడం.. 2017లో తల్లి సత్తమ్మ మరణించడంతో వారి జ్ఞాపకార్థం 2021లో వారి పొలంలో గుడిని కట్టించి, విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రతీ ఆదివారం అక్కడకు వెళ్లి పూజలు చేస్తున్నారు. కుమారులతోపాటు మనుమలు, మునిమరాండ్రు సైతం పూజలు చేయడం విశేషం.

అమ్మ ప్రోత్సాహంతోనే..



జోగిపేట(అందోల్): అమ్మ ఇచ్చిన ప్రోత్సాహంతోనే ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నా. చిన్నప్పటి నుంచే క్రీడలు, సామాజిక సేవలో ఉత్సాహంగా పాల్గొనేలా తల్లి దండ్రులు సహకారం అందించారని గుర్తు చేసుకున్నారు సంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ. మదర్స్‌డే సందర్భంగా తన మాతృమూర్తి శాంతాదేవితో తనకున్న అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉండడంతో తరచూ ఇంట్లో జరిగే చర్చల్లో భాగస్వామ్యం కావడం, పాఠశాల స్థాయిలో నాయకత్వ లక్షణాలు అలవాటయ్యాయని తెలిపారు. చరిత్ర తెలుసుకునేందుకు అవసరమైన పుస్తకాలను అమ్మ మాతో చదివించేదని, దీంతో బయటి ప్రపంచం గురించి అనేక విషయాలను తెలుసుకోగలిగానని గుర్తుచేసుకున్నారు. అట్టు తల్లిగారి కుటుంబం, ఇటుభర్త జైపాల్‌రెడ్డి కుటుంబం రాజకీయాలకు దగ్గరగా ఉండడంతో జెడ్పీ చైర్‌పర్సన్‌గా సక్సెస్‌ఫుల్‌గా రాణిస్తున్నానని గర్వంగా చెబుతున్నారు.

– మంజుశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్

తల్లిని మించిన దైవం లేదు



జన్మనిచ్చిన తల్లిదండ్రులే నిజమైన దేవుళ్లు. అమ్మ మృతిని మరిచిపోలేక తనను ఎప్పుడూ చూసుకోవాలనే కోరితో మా పొలంలోనే గుడికట్టించాం. అమ్మనాన్న విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రతీ వారం వారికి పూజలు చేస్తున్నాం. గుడికి వస్తే చాలా ప్రశాంతంగా ఉంటుంది.

– చంద్రాగౌడ్, లైన్‌మెన్

ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవలు

హుస్నాబాద్: తల్లిపై మమకారం, ఆప్యాయత జీవితాంతం గుర్తుండేలా ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నాడు ఆ కుమారుడు. హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ, వెంకటముత్యం దంపతులకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారులు రాజమౌళి, సుదర్శన్, దయాకర్, ప్రభాకర్, జగదీశ్వర్. చిన్నకుమారుడు జగదీశ్వర్ రిటైర్డ్ టీచర్. తల్లిపేరు మీద 2018లో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులు, వృద్ధులు, పేదలకు తన వంతు సాయం చేస్తున్నాడు. అవివాహితుడైన జగదీశ్వర్ నెల నెలా వచ్చే పెన్షన్‌తో తోచినంత సాయం అందిస్తున్నాడు. ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు 76 ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, పరీక్ష ప్యాడ్‌లు, గణిత దినోత్సవం రోజున ప్రతిభ గల విద్యార్థులకు నగదు, ఆగస్టు 15, జనవరి 26న పోటీలు నిర్వహించి బహుమతులు అందించాడు.


పొట్లపల్లిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

వృద్ధులు, వికలాంగులకు దుస్తులు, ఆలయాలు, క్రీడా మైదానాల్లో కూర్చునేందుకు బెంచీలు, వృద్ధాశ్రమాలకు బీరువాలు, అన్నదానం, పేదలకు నిత్యావసరాల పంపిణీ, అనారోగ్యంతో ఉన్నవారికి, పేద విద్యార్థులకు చదువుకు ఆర్థిక సాయం చేస్తున్నాడు.

హుస్నాబాద్‌రూరల్: తల్లి జ్ఞాపకార్థం, మదర్స్ డే సందర్భంగా గంగిశెట్టి మధురమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో శనివారం 100 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దేవసాని సుశీల చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీశ్వర్‌ను సర్పంచ్, గ్రామస్తులు సన్మానించారు.

చేతనైన సాయం చేస్తున్నా..



అమ్మ జ్ఞాపకార్థం ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. అన్నదమ్ముల సహకారంతో ఇప్పటి వరకు రూ.40లక్షల సేవా కార్యక్రమాలు చేపట్టా. పేద విద్యార్థుల చదువుకు ఉన్నంతలో చేతనైన సాయం చేస్తున్నా.

– గంగిశెట్టి జగదీశ్వర్, ట్రస్ట్ ఫౌండర్

చెట్టంత ప్రేమతో..

- అమ్మ నాటిన చెట్టును సంరక్షించేందుకు చర్యలు
- అంత్యక్రియలు నిర్వహించిన చోట తిరిగి నాటించిన కుమారుడు



సాక్షి, సిద్దిపేట: అమ్మ నాటి సంరక్షించిన చెట్టు కలకాలం పదిలంగా ఉంచాలనుకున్నాడు ఆమె కుమారుడు. తల్లి అంత్యక్రియలు నిర్వహించిన చోట చెట్టును తిరిగి నాటించి మమకారాన్ని చాటుకున్నాడు. సిద్దిపేట పట్టణం రాఘవేంద్రనగర్‌కు చెందిన గన్నమనేని బాలకిషన్‌రావు, రాధ దంపతుల కుమారుడు హైకోర్టు న్యాయవాది కిరణ్‌కుమార్. తల్లి రాధ 2021 మే 12న కరోనాతో మృతిచెందగా, సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లిలో తన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. తన తల్లి రాధ 25 ఏళ్ల కిందట ఇంటి ఆవరణలో నాటిన మామిడి మొక్క వృక్షమై ఫలాలను అందిస్తోంది. కాగా కొత్త ఇంటి నిర్మాణానికి ఆ చెట్టును కొట్టేయాల్సి రావడంతో తల్లడిల్లిపోయాడు. తల్లి జ్ఞాపకార్థం చెట్టు కలకాలం ఉండాలని నిశ్చయించి 2022 జూన్‌లో శాస్త్రీయ పద్ధతిలో కొమ్మలు కత్తిరించి యంత్ర సాయంతో తల్లి అంత్యక్రియలు నిర్వహించిన చోట మళ్లీ నాటించాడు. ఏడాది పాటు బాగానే ఉన్న తర్వాత వర్షపు నీళ్లు నిలిచి ఆ చెట్టు ముర్రిగిపోయింది.

అమ్మను చూసుకుందామని..



అమ్మకు పండ్ల మొక్కలు అంటే చాలా ఇష్టం. అమ్మ నాటిన చెట్టులో అమ్మను చూసుకుందాం అనుకొని తిరిగి నాటించా.. కానీ దక్కలేదు. అమ్మ అంత్యక్రియలు నిర్వహించిన చోట త్వరలో అన్ని రకాల మామిడి, ఇతర పండ్ల మొక్కలను నాటుతా. ఫ్రూట్స్ పార్క్‌లా తయారు చేస్తా.

– కిరణ్ కుమార్, న్యాయవాది




మదర్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఘాట్ వద్ద పిల్లలతో సరదాగా సెల్ఫీ దిగిగుతున్న మాతృమూర్తులు. సాయం సంధ్యవేళ బిడ్డను ముద్దాడుతున్న తల్లి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

వేర్వేరు ఘటనల్లో పలువురికి గాయాలు

పటాన్‌చెరు టౌన్ పరిధిలో కారు, శివ్వంపేట మండలం కొత్తపేటలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో పలువురు గాయపడ్డారు.

అదుపుతప్పి కారు బోల్తా



పటాన్‌చెరుటౌన్: కారు బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని రామేశ్వరంబండ గ్రామ వీకర్ సెక్షన్ కాలనీ వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆ దారిలో వెళుతున్న ఓ కారు అదుపు తప్పి రోడ్డుపక్కన తవ్విన గుంతలో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలవగా చికిత్స నిమిత్తం ఆస్పత్రి తరలించారు.

కొత్తపేటలో ట్రాక్టర్..



గాయపడిన కూలీ

శివ్వంపేట(నర్సాపూర్): ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో కూలీలకు గాయాలైన ఘటన మండలంలోని కొత్తపేటలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం.. కొత్తపేట పూర్వ పంచాయతీ పరిధిలో ఉన్న ఇటుక బట్టీలకు పొట్టు తరలిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒడిషాకు చెందిన ముగ్గురు కూలీలకు గాయాలవగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనుభవంలేని వారు డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రవికాంత్ రావు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

పటాన్‌చెరు టౌన్: పట్టణ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే శుక్రవారం ఆలయం మూసివేసి నిర్వాహకులు ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూడగా, ఆలయంలో మూడు హుండీల్లో చిన్న హుండీ పగిలిపోయి, నగదు ఎత్తుకెళ్లినట్టు ఆలయ నిర్వాహకులు గుర్తించారు. వెంటనే పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ యువకుడు ఆలయ ఆవరణలో హుండీలు ఉన్న చోట తిరుగుతున్న దృశ్యాలు కనిపించాయి.


హుండీలో నగదు తీస్తుండగా సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

ఈతకు వెళ్లి మృత్యువాత

జిన్నారం(పటాన్‌చెరు): ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం స్నేహితులతో కలిసి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయకృష్ణ వివరాల ప్రకారం.. కానుకుంటకు చెందిన ఎర్రోళ్ల నవీన్(17), పవన్, నగేశ్, శ్రీకాంత్‌తో కలిసి గ్రామ శివారులోని కొత్తకుంటలో ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో నవీన్ కాలికి గాయమై ప్రమాద వశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు వెంటనే విషయాన్ని నవీన్ తల్లిదండ్రులకు తెలపగా, వారు చెరువు వద్దకు వచ్చి చూసే సరికి చెరువులో మునిగిపోయాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు చెరువులో గాలించి నవీన్ మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తమై మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


నవీన్ మృతదేహం

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

రెండుకు చేరిన మృతుల సంఖ్య


మల్లేశం (ఫైల్)

జోగిపేట(అందోల్): అందోలు మండలం అన్నాసాగర్ శివారులో ఈ నెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లేశం (20) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించడంతో శనివారం స్వగ్రామమైన చింతకుంటలో అంత్యక్రియలను నిర్వహించారు. కాగా ఈ ప్రమాదంలో నలుగురు గాయపడగా రెండు రోజుల క్రితం రాజు మృతిచెందిన విషయం తెలిసిందే. మల్లేషం మృతితో మృతుల సంఖ్య రెండుకు చేరింది. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. జోగిపేటలోని గాజుల దుకాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మల్లేశం మృతి చెందడంతో కుటుంబం సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

వడదెబ్బతో వృద్ధుడు..

నిజాంసాగర్ (జుక్కల్): కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రంలో వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన అంబయ్య (68) రెండ్రోజుల క్రితం కామారెడ్డి జిల్లా తాడ్వాయిలోని శబరిమాత ఆలయ దర్శనానికి వచ్చాడు. శనివారం తిరిగి వెళ్తూ నిజాంసాగర్ బస్టాండ్ ప్రాంతంలో ఎండవేడిమికి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు సపర్యలు చేసి ఓఆర్ఎస్ తాగించారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

రాడ్డు తగిలి కార్మికుడు..

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు పరిశ్రమలో ఇంజిన్‌లోని రాడ్డు తలకు తగిలి కార్మికుడు మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట ఎలాస్‌మెంట్ కనెక్టర్ పరిశ్రమలో చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఇన్‌చార్జ్ ఎస్‌ఐ పోచయ్య కథనం మేరకు... బిహార్ రాష్ట్రం బోజ్పూర్ జిల్లా రుబేదికి చెందిన బహదూర్ యాదవ్ (25) శుక్రవారం రాత్రి పరిశ్రమలో పనిచేస్తుండగా ఇంజిన్‌రాడ్ తలకు తగిలింది. తీవ్రంగా గాయపడిన బహదూర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి గ్రామానికి చెందిన తోటి కార్మికుడు రుపేష్‌యాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇటుకబట్టీ యజమానితో కార్మికుల ఘర్షణ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారు తూర్పు గుంటూరుపల్లి ప్రాంతంలో ఓ ఇటుక బట్టీ యజమానికి కార్మికుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇటుక బట్టీ యజమాని రామకృష్ణ బట్టీలో పని చేసేందుకు ఒడిషా నుంచి 100 మంది కార్మికులను తీసుకువచ్చాడు. పని విషయంలో కార్మికులకు, యజమానికి మధ్య శనివారం ఘర్షణ తలెత్తింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకూ వెళ్లింది. ఆగ్రహించిన కార్మికులు భార్య, పిల్లలతో కలిసి సామన్లు సర్దుకుని వెళ్లిపోయారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వీరిని స్థానికులు ఏమైందని ఆరా తీయగా.. ఇటుక బట్టీ యజమాని తమను సరిగా చూసుకోవడం లేదని, తమపై దాడి చేశాడని తెలిపారు. ఈ విషయమై ఇటుక బట్టీ యజమాని రామకృష్ణను ఫోన్‌లో సంప్రదించగా.. ఒప్పందం ప్రకారం రెండు వారాల పాటు పని చేయాల్సి ఉందని, ఈ విషయమై ప్రశ్నిస్తే ఘర్షణకు దిగి వెళ్లిపోయారని సమాధానం ఇచ్చాడు.


సామగ్రితో వెళుతున్న కార్మికులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


గాండ్ల రాములు (ఫైల్)


నాగరాజు (ఫైల్)


రోడ్డు ప్రమాద దృశ్యం

జోగిపేట(అందోల్): బైక్, ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన అందోలు మండలం బ్రహ్మణపల్లి చౌరస్తా వద్ద శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. అందోల్‌కు చెందిన గాండ్ల రాములు (29), డాకూర్ గ్రామానికి చెందిన చింతకి నాగరాజు (24) బైక్‌పై తాల్‌ల్మలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లి, జోగిపేటకు తిరిగి వస్తుంన్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాములు, నాగరాజు అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ అజాగ్రత్తతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సామ్యానాయక్ తెలిపారు.

రెండుమూడు రోజుల్లో చంపేస్తాం..

ఇంటి గోడపై రాసిన దుండగులు

గజ్వేల్‌రూరల్: రెండు, మూడు రోజుల్లో బాబును చంపేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి గోడలపై రాసిన ఘటన గజ్వేల్ మండలం బెజుగామలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు వివరాల ప్రకారం.. బెజుగామ గ్రామానికి చెందిన నాంపల్లి బాబుకు కొందరితో భూమి పంచాయితీ నడుస్తోంది. ఈక్రమంలో శనివారం ఉదయం లేచి చూసేసరికి రెండు, మూడు రోజుల్లో చంపేస్తామంటూ రాసి ఉండడం, ఇంటిపై డీజిల్ చల్లి ఉందని బాధితుడు బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు, కుటుంబానికి ప్రాణహాని ఉందని, పోలీసులు విచారణ చేపట్టి తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.


ఇంటి గోడపై రాసిన రాతలు